క్లుప్తంగా

26 నుంచి కాశీంస్వామి ఉరుసు


పెండేకల్లులోని కాశీం స్వామి దర్గా

తుగ్గలి: మత సామరస్యానికి ప్రతీకగా విరాజిల్లుతున్న పెండేకల్లు కాశీంస్వామి ఉరుసు ఈ నెల 26 నుంచి ప్రారంభం కానుంది. 26న గంధం, 27న ఉరుసు, 28న జియారత్ కార్యక్రమాలు ఉంటాయని గ్రామపెద్దలు పేర్కొన్నారు. రెండేళ్లకోసారి నిర్వహించే ఉరుసుకు గ్రామస్తులు బంధుమిత్రులను ఆహ్వానించి మూడు రోజుల పాటు ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. స్వామి దర్గాను దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. కాశీం స్వామిపై ఉన్న భక్తితో గ్రామంలో అనేక మంది ఆయన పేరు పెట్టుకొని భక్తిని చాటుకుంటున్నారు. ఉరుసు సందర్భంగా 27న చెక్క భజన, 28న పంచమాంకములు ఉచిత నాటక ప్రదర్శన ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకండా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన


హాలహర్విలో పోలింగ్‌బూత్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

హాలహర్వి: మండలకేంద్రంలోని పోలింగ్ బూత్‌లను మంగళవారం పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఐ నాగేంద్ర పరిశీలించారు. పోలింగ్‌బూత్‌లలో భద్రతను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ తెలిపారు. కానిస్టేబుల్ గోవర్ధన్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ప్రారంభమైన సుంకులమ్మ దేవర

తుగ్గలి: మండల పరిధిలోని రాతనలో సుంకులమ్మ దేవర ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఉదయం నుంచి తెల్లవారుజాము వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో మిఠాయి, బొమ్మల దుకాణాలు వెలిశాయి. బంధుమిత్రుల రాకతో గ్రామం కిక్కిరిసింది. సర్పంచ్ గూడూరు రాచప్ప ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టి బ్లీచింగ్ పౌడర్ చల్లారు.

వైభవంగా గంగమ్మ దేవర

మద్దికెర: స్థానిక మద్దమ్మ చెరువు గట్టు మీద వెలసిన గంగమ్మ అమ్మవారి దేవర మంగళవారం వైభవంగా నిర్వహించారు. రజక సామాజిక వర్గానికి చెందిన వారు బోనాలతో గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించి దేవాలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేష్, కాజావలి రజకులు శివ, పెద్ద మునిస్వామి, చిన్న,ముని స్వామి, ప్రసాద్, రంగన్న, చిన్న రంగన్న, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పాడి పశువులకు టీకాలు

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం పశువులకు ఉచితంగా అందిస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని వెటర్నరీ డాక్టర్ నరేంద్రనాథ్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో పశువులకు టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ.. పశువుల కు ముందు జాగ్రత్తతో గాలికుంటు నివారణ టీకాలు వేయించాలన్నారు. వ్యాధి సోకిన పశువులను ఇతర పశువులకు దూరంగా ఉంచాలన్నారు. పాడి రైతులు అప్రమత్తంగా ఉండి సకాలంలో టీకాలు వేయించాలని సూచించారు. గ్రామ వెటర్నరీ అసిస్టెంట్లు, గోపాలమిత్ర సభ్యులు పాల్గొన్నారు.

416 సంఘాలకు 'వైఎస్సార్ ఆసరా'

కృష్ణగిరి: మండలంలోని 416 పొదుపు సంఘాల్లోని 4,224 మంది సభ్యులకు వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత కింద రూ.1,87,86,270 మంజూరైనట్లు ఏపీఎం మహేశ్వరయ్య మంగళవారం తెలిపారు. దీంతో సంఘాలకు నాలుగు విడతల్లో కలిపి రూ.7,51,45,782 వారి ఖాతాలకు జమ అయ్యాయన్నారు. నాల్గవ విడతకు సంబంధించి ఈ నెల 30న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చేతుల మీదుగా సభ్యులకు మెగా చెక్కు అందజేయనున్నట్లు తెలిపారు.

ఆస్పరిలో 384 గ్రూపులకు మంజూరు

ఆస్పరి: మండలంలోని 384 పొదుపు గ్రూపులకు ఆసరా పథకం వర్తించినట్లు ఏపీఎం రాఘవేంద్ర తెలిపారు. మంగళవారం ఆస్పరిలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నాల్గవ విడుత కింద 384 గ్రూపు సభ్యులకు రూ.1.58 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. త్వరలో పొదుపు గ్రూపు సభ్యులకు సమావేశం నిర్వహిస్తామని చెప్పారు.

ఓటరు జాబితా ప్రదర్శన

హాలహర్వి: మండలంలోని ఆయా సచివాలయాల్లో తుది ఓటరు జాబితా ప్రదర్శించినట్లు తహసీల్దార్ మల్లికార్జున మంగళవారం తెలిపారు. మండలంలో మొత్తం ఓటర్లు 35,677 మంది ఉండగా, ఇందులో 17,616 మంది పురుషులు, 18,050 మంది స్త్రీలు, 11 మంది ఇతరులు ఉన్నారన్నారు. ఓటర్లకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత బీఎల్‌ఓలను సంప్రదించాలన్నారు.

అక్కాచెల్లెమ్మలకు అండగా సీఎం జగన్

- వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి
- జగనన్నకు అండగా నిలవాలని పిలుపు


మహిళా సంఘాల సభ్యులకు మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండటౌన్: మహిళలు ఆర్థికాభివృద్ధి చెందితేనే కుటుంబాలు బాగుంటాయనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను అక్కాచెల్లెమ్మలకు అందిస్తున్నారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పేర్కొన్నారు. పత్తికొండలోని టీటీడీ కళ్యాణ మండపంలో మంగళవారం సాయంత్రం వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పాల్గొని పొదుపు సంఘాల సభ్యులకు మంజూరైన నాలుగవ విడత ఆర్థిక సాయం చెక్కును అందజేశారు. పెద్ద ఎత్తున పొదుపు మహిళలు హాజరయ్యారు. సభాస్థలికి చేరుకున్న ఎమ్మెల్యేకు మహిళలు పూలు చల్లుతూ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్ ఆసరా పథకం కింద నియోజకవర్గంలోని 5 మండలాల్లో 3210 పొదుపు సంఘాల్లోని 32655 మంది సభ్యులకు నాలుగవ విడత కింద రూ.17.96 కోట్లు మంజూరుకాగా ఇప్పటి వరకు రూ.71.82 కోట్లు అందించినట్లు వివరించారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగనన్న పొదుపు మహిళల రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేసి చూపించారన్నారు. అలాగే చిరువ్యాపారాల ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొంది ఆర్థిక స్వావలంబన సాధించేలా ప్రోత్సాహం అందిస్తున్నారన్నారు. త్వరలో ఎన్నికలు రానుండడంతో టీడీపీ నేతలు మళ్లీ మోసపూరిత హామీలతో ప్రజల వద్దకు వస్తున్నారని, విశ్వసనీయత లేని వారి మాటలు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. నిరంతరం పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అన్ని పదవుల్లోనూ సామాజిక న్యాయం అమలుచేస్తున్న వైఎస్ జగనన్నకు అండగా నిలవాలని కోరారు. వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం మధుబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు ఉరుకుందమ్మ, ఎంపీపీ నారాయణదాసు, ఎంపీడీఓ కవిత, వైస్ ఎంపీపీలు బలరాముడు, వడ్డె రంగమ్మ, సర్పంచులు ప్రవీణ, అంజినయ్య, శ్రీరాములు, ప్రభాకర్ రెడ్డి, రంగానాయక్, కేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరంగడు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, మండల కన్వీనర్ కారం నాగరాజు, వక్ఫ్ బోర్డు జిల్లా డైరెక్టరు టీఎండీ హుసేన్ పాల్గొన్నారు.


పొదుపు మహిళలతో కలిసి సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే

సీఎం జగనన్నతోనే సమగ్రాభివృద్ధి


గోనెగండ్లలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న యూత్ అధ్యక్షుడు, అధికారులు

గోనెగండ్ల: గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు బందెనవాజ్ అన్నారు. మంగళవారం ఆయన ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, పీఆర్ ఏఈ శివశంకర్, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి మక్కా మసీదు, కటికె వీధి, కురువపేట, గద్వాల గేరి, ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా బందెనవాజ్ మాట్లాడుతూ.. ఇటీవల గోనెగండ్లలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకున్నారన్నారు. వాటి పరిష్కారానికి ప్రభుత్వం ప్రతి సచివాలయానికి రూ.40 లక్షలు మంజూరు చేసిందని చెప్పారు. ఈ నిధులతో ఆయా కాలనీలలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. వివిధ అభివృద్ధి పనులకు రూ.1.60 కోట్లు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. పనుల్లో నాణ్యత లోపించరాదని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈఓ సతీష్, ఎంపీటీసీ రఫీక్, కాంట్రాక్టర్ ఈశ్వరయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు గోవింద్, రాజా, పద్మనాభం, మాబువలి తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో సాంకేతిక విప్లవం


ట్యాబ్‌లు అందుకున్న హొళగుంద జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

కృష్ణగిరి: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ముందంజలో ఉండాలని కాంక్షిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులు అందిస్తూ విద్యావ్యవస్థలో సాంకేతిక విప్లవం తీసుకొచ్చారని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, పత్తికొండ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మాధవరావు పేర్కొన్నారు. మండల పరిధిలోని కటారుకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే ధ్యేయంగా సీఎం జగనన్న చర్యలు తీసుకుంటున్నారన్నారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడమే కాక, విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు ఉచితంగా అందిస్తున్నారని వివరించారు. హెచ్ఎం గోవిందు రెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రామకృష్ణ, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు జయరామిరెడ్డి, రామచంద్రుడు, శివ, శేషు, వెంకటేశ్వర్లు, లక్ష్మన్న, పెద్ద మాధులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

హొళగుంద: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 374 మంది విద్యార్థులకు మంగళవారం హెచ్ఎం నీజర్ అహమ్మద్ ఆధ్వర్యంలో పీఎంసీ చైర్మన్ మజ్జిగ సిద్దయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశా, పంపాపతి, కోగిలతోట శేషప్ప, తదితరులు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువులో రాణించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు.

27 నుంచి వాలీబాల్ పోటీలు


టోర్నమెంట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్న నీలకంఠేశ్వర స్వామి జాతర పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 27వ తేదీ నుంచి వైఎస్సార్ అంతర్రాష్ట్ర వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. టోర్నీకి సంబంధించి పోస్టర్‌ను మంగళవారం రాత్రి ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి తన నివాసంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బీఆర్ బసిరెడ్డి, భీమిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఆర్గనైజర్లు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే, సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నిర్వహించే ఈ పోటీల్లో విజేతలకు వరుసగా రూ.40,116, రూ.30,116, రూ.20,116, రూ.10,116 నగదు అందించనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లు రూ.500 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని వివరాలకు సెల్ 96668 33933, 80740 58451 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక

మద్దికెర: పేద విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం అందించే ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ పథకానికి నలుగురు విద్యార్థులు భవాని, అశ్విని, రంగస్వామి, ఉపేంద్ర ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సవిత తెలిపారు. మంగళవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఆమె మాట్లాడుతూ.. ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12 వేలు చొప్పున ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందిస్తుందన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): స్థానిక బీసీ బాలికల హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న బాలికల హైస్కూల్ 8వ తరగతి విద్యార్థిని రజిత నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైంది. ఈ మేరకు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ శైలజ ఆనందం వ్యక్తం చేస్తూ విద్యార్థినిని అభినందించారు.

క్రీడల్లో సత్తా చాటాలి

కృష్ణగిరి: పత్తికొండలో బుధవారం నుంచి నిర్వహించే నియోజకవర్గ స్థాయి 'ఆడుదాం – ఆంధ్ర' క్రీడా పోటీల్లో మండల క్రీడాకారులు సత్తా చాటాలని ఎంపీడీఓ రామస్వామి ఆకాంక్షించారు. ఆయన మంగళవారం స్థానిక కార్యాలయంలో.. నియోజకవర్గ స్థాయి క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు కిట్లు అందజేశారు. బుధవారం కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు ఉంటాయని కంబాలపాడు, ఎస్‌హెచ్ ఎర్రగుడి, అమకతాడు జట్లు పాల్గొనాల్సి ఉంటుందన్నారు. అలాగే 27న ఖోఖో, క్రికెట్ పోటీలకు అమకతాడు, కోయిలకొండ జట్లు వెళ్లాల్సి ఉంటుందన్నారు. క్రీడాకారులు సత్తాచాటి పతకాలతో తిరిగిరావాలని ప్రోత్సహించారు.

చురుగ్గా ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం

చిప్పగిరి: జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.54 లక్షలతో చిప్పగిరిలో చేపట్టిన ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో పాత నీటి ట్యాంకు ఉన్నప్పటికీ గ్రామంలోని పలు కాలనీలకు తగినంతగా నీరు సరఫరా అయ్యేది కాదు. దీంతో 60 వేల లీటర్ల సామర్థ్యంతో నూతన ట్యాంకు నిర్మాణం చేపట్టినట్లు గ్రామ సర్పంచ్ దాసరి గోవిందరాజులు తెలిపారు. ట్యాంకు నిర్మాణం పూర్తయితే గ్రామంలోని హరిజన కాలనీ, సుంకులమ్మవ్వ కాలనీ, గోవిందప్ప స్వామి కాలనీతో పాటు పలు కాలనీల్లో నీటి సమస్య తీరనుంది. ట్యాంకు నిర్మాణ పనులు చివరి దశకు చేరుకోవడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైద్యురాలి నిర్లక్ష్యంపై విచారణ


మొలగవెల్లి పీహెచ్‌సీలో విచారణ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి

ఆలూరు: మండలంలోని మొలగవెల్లి పీహెచ్‌సీలో వైద్యురాలి నిర్లక్ష్యంపై మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి విచారణ చేపట్టారు. 24 గంటలు వైద్య సేవలందించాల్సిన పీహెచ్‌సీలో వైద్యురాలు శాంతి విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంపై గ్రామస్తులు ఈ నెల 8న జిల్లా కలెక్టర్ నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిప్యూటీ డీఎంహెచ్ఓ, డాక్టర్ మురళి, గ్రామస్తుల సమక్షంలో పీహెచ్‌సీలో విచారణ చేపట్టారు. స్థానికులు భూపేష్, సీపీఐ మండల కార్యదర్శి రామాంజనేయులు తదితరులతో మాట్లాడి అభిప్రాయం నమోదు చేసుకున్నారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఆమె తెలిపారు.

ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి

మద్దికెర: ప్రజలు ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు పాటించేలా అవగాహన కల్పించాలని, వారానికి ఒకసారి డ్రైడే తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా నివారణ అధికారి చంద్రశేఖర్ సూచించారు. ఆయన మంగళవారం స్థానిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కీటక జనిత నిర్మూలన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలు శుభ్రంగా ఉంచుకునేలా చూడాలన్నారు. సాయంత్రం వేపాకు పొగ పెట్టుకోవాలని, దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడేలా అవగాహన కల్పించాలన్నారు. జ్వరం లక్షణాలున్న వారికి స్థానిక వైద్యశాలలో రక్త పరీక్షలు చేయించాలని సూచించారు. వైద్యాధికారిణి రాగిణి, సబ్‌యూనిట్ అధికారి వెంకటేశులు, సీహెచ్‌ఓ నిరంజన్‌బాబు, సూపర్‌వైజర్ కృష్ణమ్మ, సూర్యనారాయణ పాల్గొన్నారు.


ల్యాబ్‌ను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి చంద్రశేఖర్

అంగన్‌వాడీ కార్యకర్తల సంబరాలు


ఆస్పరిలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఆస్పరి: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ సిబ్బంది డిమాండ్లు పరిష్కరించేందుకు అంగీకరించడంతో మంగళవారం ఆస్పరిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు హర్షం వ్యక్తం చేశారు. కేట్ కట్ చేసి స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నా. బాణ సంచా పేల్చుతూ సంతోషం వ్యక్తం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మిగతా సమస్యలు కూడా పరిష్కరిస్తారనే నమ్మకం ఉందని వారు పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సీపీఎం, సీపీఐ నాయకులు హనుమంతు, విరుపాక్షి, బాలకృష్ణ, రామాంజనేయులు, రమేష్, అంజినయ్య, మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): అంగన్‌వాడీల డిమాండ్లన్నింటినీ నెరవేరుస్తామని ప్రభుత్వం ప్రకటించడం పట్ల ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోషియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలిత ఆనందం వ్యక్తం చేశారు. మంగళవారం ఆమె తమ నిరవధిక సమ్మె విరమణ సందర్భంగా వెల్దుర్తిలో విలేకరులతో మాట్లాడారు. మంత్రులు, అధికారులు సోమవారం రాత్రి జరిపిన చర్చలలో తమ డిమాండ్లన్నింటినీ పరిష్కరిస్తామని తెలుపుతూనే, వేతనాలకు సంబంధించి జూలై నెలలో పెంపుదల ఉంటుందని చెప్పడంతో చర్చలు సఫలం అయ్యాయన్నారు. తమ పట్ల సానుకూలంగా వ్యవహరించడంతో ప్రభుత్వం, సీఎం వైఎస్ జగన్‌పై తమ అభిమానం రెండింతలైందన్నారు. సమస్యలు పరిష్కారమైనందున సంతోషంగా విధుల్లో చేరుతున్నామని తెలిపారు. వెల్దుర్తి ప్రాజెక్టు అసోషియేషన్ ప్రతినిధులు ఈదమ్మ, వరలక్ష్మి, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ట్రైసైకిళ్ల తరలింపు

సాక్షి ఎఫెక్ట్

హొళగుంద: నిర్వహణ లేక పొలంలో నిరుపయోగంగా పడి ఉన్న ట్రైసైకిళ్లను ఎట్టకేలకు అధికారులు మంగళవారం భద్రత ఉన్న ప్రాంతానికి తరలించారు. వీధుల్లోని చెత్తను తరలించేందుకు ప్రభుత్వం ఆయా గ్రామ పంచాయతీలకు పంపిణీ చేసిన ట్రై సైకిళ్లు హొళగుంద సమీపంలో బళ్లారి రోడ్డు పక్కనున్న ఓ పొలంలో నిరుపయోగంగా ఉన్నా అధికారులు పట్టించుకోలేదు. దీనిపై 'మూలన పడ్డ ట్రైసైకిళ్లు' శీర్షికన సోమవారం సాక్షి దినపత్రికలో వార్తాకథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. అక్కడున్న 16 ట్రైసైకిళ్లను ట్రాక్టర్‌లో సంత మార్కెట్ వద్ద ఉన్న సచివాలయం-1 వద్దకు తరలించి భద్ర పరిచేలా పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ చర్యలు తీసుకున్నారు.


ట్రై సైకిళ్లను ట్రాక్టర్‌లో తరలిస్తున్న దృశ్యం

అవి - ఇవి

వ్యక్తిపై దాడి

కృష్ణగిరి: మండల పరిధిలోని పోతుగల్లు గ్రామానికి చెందిన బైరాపురం వెంగన్న, మధు, సుధాకర్, రేమట చిన్న మాధవరావు, పెద్ద మాధవరావుపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. దేవనకొండ మండలం పి.కోటకొండ గ్రామానికి చెందిన బోయ ముచ్చు రామచంద్ర ఈ నెల 22న సాయంత్రం పోతుగల్లు గ్రామానికి బంధువు సుబ్బారెడ్డిని పలకరించేందుకు వెళ్లాడు. ఇతను గతంలో బైరాపురం వెంగన్న ఇసుక ట్రాక్టర్‌ను అధికారులకు పట్టించారనే నేపంతో పైన తెలిపిన ఐదుగురు దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నాటుసారా స్థావరంపై దాడి

కృష్ణగిరి గ్రామ శివారులోని ఊటకుంట వద్ద నాటుసారా తయారు చేస్తున్నారనే సమాచారంతో మంగళవారం సాయంత్రం ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి దాడి చేశారు. గ్రామానికి చెందిన పడిగే సుధాకర్‌కు చెందిన 450 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తయారీదారుడు పారిపోయినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని మదార్‌పురానికి చెందిన రామాంజనేయులు మంగళవారం తెల్లవారుజామున ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య నాగ సోమేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాలు.. రామాంజనేయులు వెల్దుర్తిలో పలు వ్యాపారాలు చేశాడు. ప్రస్తుతం నిర్వహిస్తున్న కూల్‌డ్రింక్ షాపు సైతం మార్చి మరో వ్యాపారానికి పూనుకున్నాడని తెలుసుకున్న భార్య వారించింది. రాత్రి తర్వాత కుటుంబ సభ్యులందరూ నిద్రకు ఉపక్రమించగా రామాంజనేయులు ఇంటి హాలులో ఫ్యానుకు చీరతో ఉరివేసుకున్నాడు. కాసేపటికి గమనించిన భార్య కుటుంబ సభ్యులతో కలిసి కిందకు దింపారు. అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్న రామాంజనేయులును వెల్దుర్తి ఆసుపత్రికి, అనంతరం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కోలుకోలేక రామాంజనేయులు మృతి చెందాడు. మృతుడికి ఇరువురు సంతానం. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

డెంగ్యూ కేసు నమోదు

దేవనకొండ: మండలంలోని తెర్నెకల్ గ్రామంలో 16 ఏళ్ల బాలుడికి డెంగ్యూ జ్వరం నిర్ధారణ అయినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా మంగళవారం తెలిపారు. గ్రామంలో బాలుడి ఇంటి పరిసరాల్లో దోమల మందు పిచికారీ చేయించారు. ప్రజలు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎక్కువ రోజులు తొట్టెల్లో గానీ, డ్రమ్ముల్లో గానీ నీటిని నిల్వ ఉంచుకోరాదన్నారు. రాత్రి వేళల్లో దోమ తెరలను వాడాలన్నారు. సూపర్‌వైజర్ రంగస్వామి, సిబ్బంది ఉన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కృష్ణగిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామస్వామి మంగళవారం తెలిపారు. మండలంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. అన్ని శాఖల అధికారులు తమ నివేదికలతో రావాలని, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు కూడా తప్పక హాజరుకావాలని కోరారు.

వికసిత్ భారత్ యాత్ర

హాలహర్వి: మండలంలోని కొక్కరచేడు గ్రామంలో మంగళవారం 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర' కార్యక్రమాన్ని ఎంపీడీఓ ఆంతోని, తహసీల్దార్ మల్లికార్జున, బీజేపీ మండల అధ్యక్షుడు బసవరాజు, సర్పంచ్ మన్మథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ గడిచిన పది సంవత్సరాల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలుచేసిన పథకాలు, సేవలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఏపీఓ హేమసుందర్, పంచాయతీ కార్యదర్శి శివ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా కులగణన సర్వే

హొళగుంద: మండలంలోని ఆయా గ్రామాలలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు చేపట్టిన కులగణన సర్వే చురుగ్గా సాగుతోంది. మంగళవారం ఎంపీడీఓ సుహాసిని ఆధ్వర్యంలో సిబ్బంది సర్వే నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కుటుంబసభ్యులు వివరాలు సేకరించి ప్రత్యేక యాప్‌లో యజమాని, వలంటీర్ వేలిముద్రలను అప్‌లోడ్ చేశారు. యాప్‌లో వివరాల నమోదు చేసే పనిని వేగవంతం చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. సర్వేను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'ఆరోగ్య సురక్ష' దేశానికే ఆదర్శం


డాక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి ఆరోగ్య శ్రీ కార్డు అందిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య


కటారుకొండలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి


మారెళ్లలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని బింగిదొడ్డి గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య తనిఖీ చేశారు. గోవర్ధనగిరి పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీధర్‌రెడ్డి, నవీన్, సర్పంచ్ వెంకటేశ్వరమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంప్‌ను గ్రామస్తులు వినియోగించుకున్నారు. వైద్యుల సేవలను తనిఖీ చేసిన డీఎంఅండ్‌హెచ్‌ఓ పలువురు లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులు, ఆరోగ్య సేవలు పొందిన వారికి ఉచితంగా మందులు అందించారు. వైద్య సేవలెలా అందుతున్నది ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన వారికి మెరుగైన చికిత్స ఉచితంగా అందించేలా చర్యలు తీసుకోవాలని వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. వైఎస్సార్సీపీ నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి, పంచాయతీ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కృష్ణగిరి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని కటారుకొండ గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి వైద్య సేవలపై ఆరా తీశారు. అందుబాటులో ఉంచిన మందులను పరిశీలించి చికిత్స కోసం వచ్చిన వారితో మాట్లాడుతూ వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శిబిరంలో 363 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు వైద్యాధికారి వరప్రసాద్ తెలిపారు.

తుగ్గలి: పేదల ఆరోగ్యానికి 'జగనన్న ఆరోగ్య సురక్ష' భరోసాగా నిలుస్తోందని సచివాలయ కన్వీనర్ సుధాకరరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు లింగన్న అన్నారు. మారెళ్లలో మంగళవారం నిర్వహించిన రెండో విడత సురక్ష కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శి అంకాలప్పతో కలిసి వారు ప్రారంభించారు. శిబిరంలో స్పెషలిస్టు వైద్యులు కీర్తి, రాఘవనాయుడు, తుగ్గలి పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, ఆప్తాలిక్ అసిస్టెంట్ హనుమంతరెడ్డి, రోగులను పరీక్షించి మందులు అందజేశారు.

హాలహర్వి: గ్రామాల్లో నిర్వహించే సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి గంగాధర్ అన్నారు. మండలంలోని చింతకుంట సచివాలయం–1లో జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి గంగాధర్ రోగులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. శిబిరంలో మొత్తం 432 మంది రోగులను పరీక్షించినట్లు ఆయన చెప్పారు. వైద్యులు హర్షిత‌గ్రేసి, అరుణ్‌కుమార్, పీహెచ్‌ఎన్‌ఓ పద్మలలిత, సులోచన, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ: మండలంలోని తెర్నెకల్ గ్రామంలో సురక్ష వైద్య శిబిరాన్ని డాక్టర్ అరుణ్‌జ్యోతి ప్రారంభించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్యచికిత్సలు చేయించుకుని ఉచితంగా మందులను అందుకున్నారు. వైద్యులు ఇదయతుల్లా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నందవరం: 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించిందని ఎంపీడీఓ దశరథ రామయ్య, ఎంపీటీసీ మాధవి అన్నారు. మండల పరిధిలోని సోమలగూడూరు గ్రామంలో సురక్ష వైద్య కాంపు డాక్టర్ పరిమళ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఎంపీడీఓ పర్యవేక్షించారు. శిబిరంలో 320 మందికిపైగా ప్రజలు వైద్య సేవలు పొందారు. స్పెషలిస్టు డాక్టర్లు రాహుల్, అరవింద్, విజయభారతి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


చింతకుంటలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి గంగాధర్


తెర్నెకల్‌లో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది


టి.సోమలగూడూరులో వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ దశరథ రామయ్య